క్లుప్తంగా

తిరుపతమ్మ ఆదాయం రూ. 4.05లక్షలు



బొర్రగూడెం(మైలవరం): మండలంలోని బొర్రగూడెంలో వేంచేసియున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల దేవస్థానంలోని హుండీలను లెక్కించగా రూ.4,05,605తో పాటు 20 యూఎస్ డాలర్లు వచ్చినట్లు ఆలయ ఈవో ఎస్వీ సాంబశివరావు తెలిపారు. శ్రీతిరుపతమ్మ దేవస్థానంలో గురువారం ఉదయం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, విజయవాడ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి గోవాడ వెంకట కృష్ణారావు, భక్తులు, గ్రామస్తులు, హిందూ సేవాదళ సభ్యులు సమక్షంలో హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించామన్నారు.

సామూహిక సాయి వ్రతాలు

తిరువూరు: ఏకాదశి సందర్భంగా స్థానిక షిర్డీ సాయి మందిరంలో సామూహిక సాయివ్రతాలు ఆచరించారు. మందిర అర్చకుల ఆధ్వర్యంలో బాబాకు విశేషార్చనలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం మహిళలు సాయివ్రతాలలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గూడపాటి మాణిక్యాంబ, వీరభద్రరావు, కోశాధికారి సురేష్ పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని వినతి

తిరువూరు: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక సభ్యులు గురువారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు విజ్ఞప్తి చేశారు. తిరువూరు వచ్చిన కలెక్టర్‌ను జేవీవీ ప్రతినిధులు సుందరరావు తదితరులు కలిసి ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలో డ్రయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయని, వర్షాకాలంలో డ్రెయిన్లు పూడుకుపోయి నీరు పోయే మార్గం కనిపించట్లేదని, ప్లాస్టిక్ గ్లాసులు ఇతర ఉత్పత్తుల అమ్మకాలను నియంత్రించకపోతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు.

మాజీ ఎంపీపీకి పలువురు నివాళి

విస్సన్నపేట: విస్సన్నపేట మాజీ ఎంపీపీ మాగంటి కృష్ణమోహన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గురువారం స్థానిక నూజివీడు రోడ్డులో కల్యాణ మండపంలో ఆయనకి శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, కె. జవహర్, మాజీ ఎమ్మెల్యే ఎస్. స్వామిదాసు, గ్రామసర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ముత్యాలమ్మకు సారె సమర్పణ



గంపలగూడెం: ఆషాఢమాసం సందర్భంగా గంపలగూడెంలో గ్రామ దేవత ముత్యాలమ్మకు గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ముందుగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి నూతన వస్త్రాలు, వివిధ రకాల పూలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సారె సామగ్రితో ఆలయం చుట్టూ పలు ప్రదర్శనలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారి పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమావేశం

తిరువూరు: హౌసింగ్, జగనన్న పాలవెల్లువ కార్యక్రమాల అమలుపై శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తిరువూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ప్రసన్నలక్ష్మి తెలిపారు. తిరువూరు రెవెన్యూ డివిజన్లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పశుసంవర్థక, హౌసింగ్, మెప్మా, వెలుగు, నగరపంచాయతీ అధికారులు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

ఓటర్ల జాబితాపై సమగ్ర పరిశీలన

బీఎల్‌వోలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

తిరువూరు: ఓటర్ల జాబితాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు బీఎల్‌వోలను ఆదేశించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గురువారం తిరువూరు నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాల పరిశీలనపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సర్వే చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ఓటర్ కార్డును ఆధార్‌తో అనుసంధానించడంతో డూప్లికేట్ ఓట్లను నివారించవచ్చని, ఇంకా మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన పేర్లు తొలగించాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించాల్సిన బాధ్యత బీఎల్‌వోలదేనని తెలిపారు. జాబితాల్లో ఓటరు పేరు, డోర్ నంబర్, ఏరియా వివరాలలో తప్పులుంటే సరిచేయాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు కసరత్తు ప్రారంభించండి..

మైలవరం: ఎన్నికలకు కసరత్తు ఇప్పటి నుంచి ప్రారంభించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. మైలవరం శ్రీసాయిబాబా కల్యాణ మండపంలో మైలవరం నియోజకవర్గం బూత్ లెవెల్ అధికారులతో గురువారం కలెక్టర్ ఢిల్లీరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. మైలవరం తహసీల్దార్ ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా నిర్ధారణ విషయంలో పారదర్శకంగా ఉండాలన్నారు. పారదర్శకంగా ఓటర్ల నిర్ధారణ జరిగితేనే పోలింగ్ శాతం పెరుగుతుందని సూచించారు. డీఆర్‌ఓ మోహనరావు మాట్లాడుతూ రాబోయే 9నెలల్లో ఎన్నికలున్న తరుణంలో ఆగస్టు 24కల్లా ఓటర్ల తుది జాబితా పూర్తి చేసే విధంగా అధికారులు అవగాహన కల్పించారు. జాతీయ, రాష్ట్రీయ పార్టీల నుంచి బూత్ లెవెల్ అసిస్టెంట్స్‌తో కలిసి ఓటర్ల వివరాలను అధికారులు సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుగా నమోదైన డోర్ నంబర్ల ఓటర్ల వివరాలు ప్రక్షాళన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకుమారి, బీఎల్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యానవనాల పెంపునకు కృషి



చంద్రాలలో మామిడి మొక్క నాటుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, గంగాధరరావు, లక్ష్మీకుమారి

చంద్రాల(మైలవరం): ఉద్యానవనాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామానికి చెందిన రైతు గుణదల పరిశుద్ధంకు చెందిన 2.50 ఎకరాల పంట పొలంలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. కలెక్టర్ ఢిల్లీరావు మామిడిమొక్కను నాటి నీరు పోశారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ మామిడి మొక్కలు ఎలా నాటాలి, ఏ సమయంలో ఎలాంటి ఎరువులు, మందులు ఉపయోగించాలి, మామిడిలో వచ్చే వివిధ రకాల తెగుళ్లు ఎలా అరికట్టాలి తదితర విషయాలు తెలియజేసి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మొక్కలకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందించడానికి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు మాట్లాడుతూ మామిడి రైతులను వేధిస్తున్న తెగుళ్ల నివారణకు కలెక్టర్ చేసిన సూచనలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రైతు బాంధవుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల ద్వారా రైతులకు అవసరమైన ఉద్యాన మొక్కలను రాయితీతో, ఉపాధి కూలీలతో ప్రభుత్వమే నాటిస్తుందని వినియోగించుకోవాలని కోరారు. సర్పంచ్ జె. జ్యోతి ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ సునీత, ఎంపీడీఓ లక్ష్మీకుమారి, తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీ, ఏఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు : అర్హత ఉన్న ప్రతి గడపకూ సంక్షేమ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ ఇంటింటికీ పర్యటించి వారికి వచ్చిన పథకాల వివరాలను, అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలన్నీ ఆగిపోకుండా కొనసాగాలన్న వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పార్వతీదేవికి ఆషాఢ సారె సమర్పణ



కాచవరం రామలింగేశ్వరాలయంలో అమ్మవారికి సారె సమర్పించి, పూజలు చేస్తున్న భక్తులు

కాచవరం(ఇబ్రహీంపట్నం): ఆషాఢమాసం సందర్భంగా కాచవరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీపార్వతీదేవి అమ్మవారికి గురువారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకాలు, పార్వతీ అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన జరిపారు. అనంతరం అమ్మవారికి పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు, గాజులు, పండ్లతో సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కంచిభొట్ల సుబ్రహ్మణ్యశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తోటపల్లి మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి



నూజివీడులో ఎమ్మెల్యే ప్రతాప్‌కు వినతిపత్రం అందజేస్తున్న తోటపల్లి గ్రామస్తులు

నూజివీడు : ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి మాజీ సర్పంచి, టీడీపీ నాయకుడు ఆరేపల్లి శ్రీనివాసరావు గ్రామంలో అభివృద్ధి పనులు జరగనీయకుండా, పేదలకు నివేశన స్థలాలు ఇవ్వనీయకుండా అభివృద్ధి నిరోధకుడిగా మారాడని గ్రామస్తులు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు వద్ద గురువారం తమ గోడు వెళ్లబోసుకున్నారు. దాదాపు 2వందల మంది గ్రామస్తులు ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన భార్య సర్పంచ్ అయితే ఆమె విధుల్లో నిరంతరం జోక్యం చేసుకుంటూ గ్రామంలోని అసైన్డ్‌ల్యాండ్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నాడన్నారు. ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తే పనులు నిర్వహించడానికి పంచాయతీ తీర్మానం ఇవ్వడం లేదన్నారు. దీంతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడిపోయిందన్నారు. దీనిపై విచారణ జరిపి పంచాయతీ సర్పంచిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యేతో పాటు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారంతో మాతా, శిశు మరణాలు తగ్గించాలి

మైలవరం: పోషకాహారంతో మాతా, శిశు మరణాలు తగ్గించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జె. రాజేంద్రన్ అన్నారు. మైలవరం సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ కె. పుష్పలత అధ్యక్షతన అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం జరిగింది. డాక్టర్ రాజేంద్రన్ మాట్లాడుతూ ఎస్‌డీజీ గిల్స్ పూర్వ ప్రాథమిక విద్యను అందరికీ అందించే విధంగా, మాతా శిశు మరణాలు తగ్గించే విధంగా ఆరోగ్య స్థాయిని పిల్లలు, తల్లుల్లో మెరుగు పరిచే విధంగా కార్యకర్తలు అందరూ కృషి చేయాలన్నారు.

నేడు జాతీయ స్థాయి సదస్సు

ఇబ్రహీంపట్నం: గుంటుపల్లి రైల్వేవ్యాగన్ వర్క్‌షాపులో జాతీయ స్థాయి సీఆర్‌ఎస్‌ఈ (చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్స్)ల సదస్సు శుక్రవారం జరుగుతుందని వర్క్‌షాపు చీఫ్ వర్క్ మేనేజర్ శ్రీనివాస్, పర్సనల్ అధికారి సుభాష్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. దేశంలోని అన్ని రైల్వే జోన్‌ల నుంచి పలువురు ఇంజినీర్లు పాల్గొంటారు. పర్యావరణ పరిరక్షణ, కార్మికుల భద్రత, పరిశుభ్రత, సాంకేతిక, యాంత్రిక పద్ధతిపై కూలంకుషంగా చర్చిస్తారు. రెండు నిమిషాల వ్యవధిలో 1500 మొక్కలు నాటి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాధించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

'అమరావతి'లో అరుదైన శస్త్ర చికిత్స

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రిలో అరుదైన వెన్నెముక శస్త్ర చికిత్స చేసినట్లు చైర్మన్ కోనేరు కృష్ణన్, ఎండీ రమేష్‌బాబు తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయికి చెందిన అడపా సూర్యచంద్రరావు విద్యుత్ షాక్‌కు గురై కొబ్బరిచెట్టు పైనుండి కిందపడిపోయడన్నారు. దీంతో మెడ వెన్నెముకలకు గట్టి దెబ్బ తగిలి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. తమ ఆస్పత్రి వైద్యులు కేవీఆర్ కిషోర్, నెక్కలపు కృష్ణ చైతన్య, కావ్య కోనేరు, మణిమేఘనలు అతనికి 5 గంటల పాటు శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. తిరువూరు వంటి మారుమూల ప్రాంతంలో క్లిష్టమైన శస్త్రచికిత్స అందించామని పేర్కొన్నారు.

16న డీఏఆర్ కళాశాలలో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నూజివీడు : పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో ఈనెల 16న కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు జి. సుభాష్ చంద్రబోస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి 2010 తర్వాత జన్మించిన వారు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని, మీసేవ కేంద్రం ద్వారా జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకొని రావాలన్నారు. ఎంపికైన వారు ఈనెల 20నుంచి 25వరకు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు.

9 మందికి ట్రిపుల్ ఐటీ సీట్లు

నూజివీడు : పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన 9 మంది విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థినులు టీ లెనీనా, ఎస్. యామిని, పి. యామిని, డి. ఐశ్వర్యబాయి, డి. వసుంధర, టి. భారతి, డి. ఆలివా, బి. హేమ మాధురి, సానియామీర్జా ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు.

హైస్కూల్ విద్యార్థినికి..

విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన విద్యార్థిని దాగం బాల అఖిలేశ్వరికి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు.

తమ్మిలేరు ప్రాజెక్టుకు స్వల్ప వరద

చాట్రాయి : ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిసరాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి స్వల్పంగా వరద నీరు చేరుతుంది. రెండు రోజుల నుంచి ఎగువన వర్షాలు కురుస్తుండడంతో గురువారం సాయంత్రం నుంచి ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనుబల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడగా తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన షేక్ కరీముల్లా ఈనెల 2వ తేదీన తెలంగాణలోని ఖమ్మం జిల్లా ముత్తగూడెంలోని రెస్టారెంట్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ముత్తగూడెం ఆర్టీఓ చెక్‌పోస్టు ఎదురుగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడగా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయనను 108లో తిరువూరు ఆస్పత్రికి, అక్కడి నుంచి మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



తండాలో సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కె. రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని కేశ్య తండాలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా అని తెలుసుకొని వారికి సంక్షేమ పథకాల గూర్చి వివరిస్తూ బ్రోచర్లు అందించారు. రహదారులు వేయించాలని, విద్యుత్ స్తంభాలు అవసరమని, కాలనీ గృహాలు మంజూరు చేయించాలని పలువురు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో 425 కుటుంబాలకు పలు రకాల సంక్షేమ పథకాల ద్వారా మొత్తం రూ. 4.13కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. అలాగే రూ. 2.50 కోట్లతో తండా నుంచి జాతీయ రహదారులు, గ్రావెల్ రహదారులు కూడా వేయించనున్నట్లు తెలిపారు. ఈ విషయమై సంబంధిత మంత్రిని కూడా కలసి వివరించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ తండాలో అభివృద్ధి పనులు చేయించటానికి మరో రూ. 10లక్షలు కూడా కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జరబల జమలమ్మ, పర్వతనేని నాగమల్లేశ్వరి, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పర్వతనేని చంద్రమోహనరరావు, ఎంపీటీసీ బరోతు వెంకటేష్‌నాయక్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి సతీష్, రామకృష్ణ, ఏ. శ్రీనివాసరావు, వైకుంఠరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మైలవరం: మైలవరం రామకృష్ణ కాలనీలో ఇటీవల భర్త చేతిలో హత్యకు గురైన పెనుముక్కల దుర్గాభవాని ఇద్దరు పిల్లకు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనల మేరకు వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఆర్థిక సహాయాన్ని అందించారు. రూ. 75వేల నగదును మృతురాలి బంధువులకు స్థానిక పార్టీ కార్యాలయంలో అందజేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు జి. వెంకట్రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మృతురాలు దుర్గా భవానికి తండ్రి లేడు, వృద్ధురాలైన తల్లి కూలి పనులు చేసుకుని జీవిస్తోంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి. వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఉప సర్పంచ్ చామల సీతారెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగులూరు ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి



నామా సత్యనారాయణ(ఫైల్)

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు తెలుగుదేశం పార్టీ నాయకులు నామా సత్యనారాయణ(70) గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంగా ఉన్న అయన ఇంటి వద్ద మృతి చెందారు. సత్యనారాయణ పెనుగొలను ఎంపీటీసీ సభ్యులుగా, నీటి సంఘం అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. మృతదేహాన్ని విజయవాడ ఎంపీ కేశినేని నాని, మాజీ మంత్రివర్యులు జవహర్, నెట్టెం రఘురాం, తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుధారాణి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు మృతదేహాన్ని సందర్శించి తమ సంతాపాన్ని కుటుంబీకులకు సానుభూతి వ్యక్తపరిచారు.

సత్వర సేవలకే జగనన్న సురక్ష



నూజివీడు 15వ వార్డులో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు : అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలను లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని 15, 16 వార్డులకు సంబంధించి గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 456 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి(నూజివీడు) :** మండలంలోని ఎస్ ఏపేటలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 865 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గోళ్ల అనూష పాల్గొన్నారు.
- **పెనుగొలను/అనుముల్లంక(గంపలగూడెం):** మండలంలోని పెనుగొలను-1, అనుముల్లంక సచివాలయాల్లో అధికారులు గురువారం జగనన్న సురక్ష క్యాంపులు జరిపారు. పెనుగొలను-1 శిబిరంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి పాల్గొని మాట్లాడారు. మంజూరైన 615 ధ్రువీకరణపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి, సర్పంచ్ సంగెపు లలిత పాల్గొన్నారు. అనుముల్లంకలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో 475 మంది దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను అందజేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ బాబూరావు తెలిపారు.
- **జి.కొండూరు:** మండల పరిధి వెలగలేరు, జి.కొండూరు-1 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు పాల్గొన్నారు.
- **ముసునూరు :** అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే జగనన్న సురక్ష ధ్యేయమని వైస్ ఎంపీపీ కె.రాజానాయన, జెడ్పీటీసి డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన గురువారం బలివేలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. 460 మంది లబ్ధిదారులకు వివిధ పత్రాలు పంపిణీ చేశారు.
- **చాట్రాయి:** మండలంలోని చిన్నంపేట గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం 11 రకాల సేవలకు సంబంధించి 752 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పరసా ధనలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పరసా చెన్నారావు పాల్గొన్నారు.
- **రెడ్డిగూడెం:** మండలంలోని కుదప, నాగులూరు గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.
- **కాచవరం(ఇబ్రహీంపట్నం):** కాచవరంలో గురువారం జగనన్న సురక్షలో జెడ్పీ వైస్ చైర్సన్ గరికపాటి శ్రీదేవితో కలిసి డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- **వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట):** మండలంలోని వేమిరెడ్డిపల్లి,నరసాపురం సచివాలయం -2 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వేమిరెడ్డిపల్లి సర్పంచ్ పి. విజయకుమారి ఎంపీటీసీ సత్యనారాయణచారి పాల్గొన్నారు.
- **తిరువూరు రూరల్:** మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి, మల్లేల గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయాల ద్వారా 11 రకాల సేవలకు దరఖాస్తు చేసుకున్న 1600 మందికి ఈ కార్యక్రమంలో ధ్రువీకరణపత్రాలను జారీచేశారు.
- **మైలవరం:** స్థానిక మూడో గ్రామ సచివాలయం ప్రాంగణంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం జరిగింది. వైఎస్ ఎంపీపీ షేక్ రహీమ్, తహసీల్దార్ ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.